
ప్రజాశక్తి

గురువారం 21 మార్చి 2024

5

పార్వతీపురం మన్యం



మూడో రోజు 99.20 శాతం హాజరు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

పార్వతీపురం మన్యం జిల్లాలో మూడో రోజు బుధవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు డిఇఒ పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మూడో రోజు జిల్లా వ్యాప్తంగా 66 కేంద్రాల్లో జరిగిన హిందీ పరీక్షకు 10,554 మందికి గాను 10470 మంది విద్యార్థులు హాజరయ్యారు. 84 మంది విద్యార్థులు ఈ పరీక్షకు గైర్హాజరయ్యారు. 99.20 శాతం హాజరు నమోదైనట్లు డిఇఒ తెలిపారు. ఆరు పరీక్షా కేంద్రాలను బుధవారం డిఇఒ తనిఖీ చేశారు. 24 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్లు పరిశీలించాయి.

టిడిపిలో గ్రూపుల గోల



- టిక్కెట్లు రాక కొందరు
- పొత్తుతో నష్టమని మరికొందరు

టిడిపిలో విజయనగరం, బొబ్బిలి మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ గ్రూపుల గోల రోజురోజుకూ బిగుసుకుంటోంది. ఆ పార్టీలోని అంతర్గత రాజకీయాలు ముదరపాకాన పడుతున్నాయి. విబేదాలు తారా స్థాయికి చేరుకుంటున్నాయి. టిక్కెట్లు రాకపోవడం వల్ల కొందరు కినుక వహించగా, జనసేన, బిజెపితో పొత్తుకారణంగా మరికొందరు టిడిపి నేతలు అలకబూనారు. అభ్యర్థులు మాత్రం ఇవేవీ పట్టించుకో కుండా ముందుకు సాగుతున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు టిడిపి, జనసేన అభ్యర్థులను ఫిబ్రవరి 24న ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి గజపతినగరంలో టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ప్రచారంలో దూసుకుపోతున్నప్పటికీ, సీటు ఆశించి భంగపడ్డ కెఎ నాయుడు ఇంకా ప్రచారంలో కలిసిరాలేదు. తాను శ్రీనివాస్‌కు సహకరించే పరిస్థితే లేదని బాహాటంగానే చెబుతున్నారు. పున:పరిశీలనలో భాగంగా తనకు సీటు వస్తుందంటూ కేడర్‌ను శ్రీనివాస్‌తో వెళ్లనీయకుండా అడ్డుపడుతున్నారు. మరోవైపు శ్రీనివాస్, ఆయన అనుచరులు మాత్రం కొద్ది రోజుల్లో అన్నీ సమసిపోతాయని దీమా వ్యక్తం చేస్తున్నారు. నేతల మధ్య నెలకొన్న అనైక్యతను వైసిపి తనకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. చీపురుపల్లిలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జునను పక్కనబట్టి మాజీ మంత్రులు గంటా లేదా కిమిడి కళావెంటరావులను పోటీ చేయించేందుకు అధిష్టానం ప్రయత్నిస్తోంది. ఈ ఇద్దరు నేతలూ ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. పోటీలో ఎవరు నిలుస్తారో తెలియక కేడర్ అయోమయంలో ఉంది. అభ్యర్థి ఎవరనేది తేలే లోపే రాజకీయాలను తనకు అనుకూలంగా మలుచుకునే పనిలో వైసిపి నుంచి ఇక్కడ బరిలో దిగబోతున్న మంత్రి బొత్స సత్యనారాయణ స్పీడు పెంచారు. రాజాం అభ్యర్థి కొండ్రు మురళీ, టిడిపి సీనియర్ నేత కావలి ప్రతిభా భారతి మధ్య చాలా కాలంగా అంతర్గత విభేదాలు ఉన్నాయి. నిన్న మొన్నటి వరకు ప్రతిభా భారతి గ్రూపునకు సీనియర్ నేత కిమిడి కళావెంకటరావు పరోక్షంగా అండదండలందించారు. ప్రస్తుతం ఆయన ఆశిస్తున్న ఎచ్చెర్లలో సీటు ఖరారు కాలేదు. దీంతో, ప్రతిభా భారతి, ఆమె కుమార్తె గ్రీష్మ స్వరం తగ్గినప్పటికీ ఇప్పటికీ కోండ్రు మురళీ తరపున ఎన్నికల ప్రచారానికి వెళ్లడం లేదు. ఎస్.కోటలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ మధ్య గ్రూపు రాజకీయాలు కొనసాగుతున్నాయి. ఇద్దరూ సీటు కోసం ఆశపడుతున్నారు. ఈనేపథ్యంలో ఇటీవల లోకేష్ పర్యటనలో ఈ రెండు గ్రూపుల మధ్య పెనుగులాట వరకు వెళ్లిన సంగతి విధితమే. పరిస్థితి ఇంకా అలాగే కొనసాగుతోంది. ఇటు నెలిమర్లలో పొత్తులో భాగంగా ఎమ్మెల్యే సీటు జనసేనకు వెళ్లడం, పార్లమెంట్ సీటు బిజెపికి పోయే పరిస్థితి ఏర్పడడంతో టిడిపి కేడర్ అంతర్మధనంలో ఉంది. ఈ నియోజకవర్గంలోనూ అంతర్గతంగా రెండు గ్రూపులు ఉన్నాయి. ఇందులో ఒక గ్రూపు వైసిపికి సహకరించే అవకాశాలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టే నియోజకవర్గ ఇన్‌ఛార్జి బంగార్రాజు మౌనం వీడడం లేదు. జనసేన అభ్యర్థికి మద్ధతుగా ప్రచారానికి వెళ్లడం లేదు.

పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరులో టిడిపి అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ మధ్య దీర్ఘకాలికంగా కొనసాగుతునే ఉన్నాయి. తొలి నుంచీ వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించుకుం టున్నారు. ఈ ఎన్నికల్లోనూ ఇద్దరూ కలిసికట్టుగా పనిచేసే పరిస్థితి లేదని సాక్షాత్తు టిడిపి కార్యకర్తలే చెప్పుకుంటున్నారు. వీరి అనైక్యత వైసిపికి వరంగా మారబోతుందని కూడా చర్చనడుస్తోంది. పార్వతీపురంలో మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు ఇప్పుడిప్పుడే అసంతృప్తి నుంచి బయటపడినప్పటికీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ద్వారాపురెడ్డి జగదీష్, అభ్యర్థి విజయ చంద్ర ఒకరినొకరు పట్టించుకోవడం లేదు. ఈరకమైన మనస్పర్థలను తనకు అనుకూలంగా మలుచుకునే పనిలో వైసిపి నిమగ్నమైంది. కురుపాంలో మరో విచిత్రమైన పరిస్థితి. అభ్యర్థి తోయక జగదీశ్వరికి సీనియర్ నేత, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఆశీస్సులు ఉన్నప్పటికీ ఆయన వృద్ధాప్యంలో వున్నారు. ఆయన ప్రియశిష్యుడు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావు మరో నాయకుడికి టిక్కెట్ వస్తుందని ఆశించారు. ఖంగుతిన్న ఆయన ఇప్పటికీ జగదీశ్వరి తరపున ప్రచారంలో పాల్గొనకపోవడంతో అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. అటు పాలకొండ నియోజకవర్గంలో మొత్తం ఆరుగురు ఆశావహులు ఉండడంతో అభ్యర్థి ఎవరనేది నేటికీ అధిష్టానం తేల్చలేని పరిస్థితి నెలకొంది.

విస్తారంగా వర్షాలు

ప్రజాశక్తి-విజయనగరం/పాలకొండ

బంగాళా ఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ అడపా దడపా వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అక్కడక్కడా మొక్కజొన్నకు స్వల్ప నష్టం వాటిల్లింది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా చీపురుపల్లి మండలంలో 136.8 మిల్లీమీటర్ల వర్షం కురవగా రామభద్రపురం, వేపాడ, కొత్తవలస మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. గరివిడి మండలంలో 131.2మి.మీ., దత్తిరాజేరు మండలంలో 53.2మి.మీ., మెరకముడిదాం 36, మెంటాడ 34.2, గజపతినగరం 32.4, బొండపల్లి 32, సంతకవిటి 28.2, విజయనగరం 23.6, గుర్ల 20.8, రేగిడి 18.8, తెర్లాంలో 18.6, డెంకాడ 16.2 మి.మీ. వర్షం కురిసింది. తక్కువగా నెల్లిమర్లలో 8.6, బాడంగి 8.2, వంగర 6.6, బొబ్బిలి 4.4, గంట్యాడ 3.8, భోగాపురం 3.6, పూసపాటిరేగ 2.8, లక్కవరపుకోట, శృంగవరపుకోట, జామి మండలాల్లో 2.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.



పాలకొండలో కురుస్తున్న వర్షం

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రజలు కొంత అసౌకర్యానికి గురయ్యారు. గాలులతో కూడిన వర్షం కురవడంతో మామిడికి కొంత నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పిడుగు పడి 35 గొర్రెలు మృతి

తెర్లాం : మండలంలోని వి.చిన్నయ్యపేట గ్రామంలో పిడుగు పడి 35 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల కాపరి వెన్నెల రాము బుధవారం ఉదయం గొర్రెలను మేపునకు తీసుకొని పొలంలోకి వెళ్లాడు. గొర్రెలు మేత మేస్తుండగా, ఒక్కసారిగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. దూరం నుంచి చూస్తుండగానే పిడుగు పడి మృతి చెందాయని రాము ఆవేదన చెందారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



మృతిచెందిన గొర్రెలు

సీతంపేటలో కుండపోత

సీతంపేట : ద్రోణి ప్రభావంతో సీతంపేటలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. బుధవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11 వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు, విద్యార్థులకు కొంత ఆటంకం కలిగింది. ఈ వర్షం వేసవి పంటలు కూడా దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కురుపాం ఏజెన్సీలో చిరుజల్లులు

కురుపాం : ద్రోణి ప్రభావంతో కురుపాం ఏజెన్సీలో బుధవారం ఉదయం అక్కడ అక్కడ చిరుజల్లులు పడ్డాయి. దీంతో వేసవి ఎండ వేడిమికి ఉక్కిరిబిక్కిరి అయిన మన్యం ప్రజలకు ఈ చిరుజల్లులతో కొంత ఉపశమనం లభించింది. చిరుజల్లులు వల్ల జీడి, మామిడి పూత, పింజ దశలో ఉండటంతో రాలిపోయి పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని జీడి మామిడి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ప్రేమించిన అమ్మాయి దక్కలేదని కారణంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం మండలంలోని వెలగవలసలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సాలూరు మండలం వెలగవలస గ్రామానికి చెందిన జన్మి రమేష్ (21) మండలంలోని తోణాం పంచాయతీ పరిధిలోని దిగువమండంగికి చెందిన యువతి ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుందామని అనుకున్న తరుణంలో పెద్దలు వీరి వివాహానికి అంగీకరించలేదు. దీంతో రమేష్ బుధవారం ఉదయం వెలగవలస గ్రామంలో తన పొలంలో పురుగుల మందు తాగాడు. అనంతరం తన అన్నయ్యకు ఈ విషయాన్ని ఫోన్ ద్వారా చేరవేశాడు. కొన ఊపిరితోనున్న రమేష్‌ని వెంటనే సాలూరు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి విశాఖపట్నం కెజిహెచ్‌కు వైద్యులు రిఫర్ చేశారు. పరిస్థితి విషమించి కెజిహెచ్‌లో మధ్యాహ్నం మరణించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి-బలిజిపేట

పోషణ్ పక్వాడా కేలండర్‌పై తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి అన్నారు. మండలంలోని పలగర గ్రామంలో అంగన్వాడి కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కేలండర్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పక్కాగా కేలండర్‌ను అమలు చేయాలని, డెస్క్ ద్వారా ఫొటోలు అప్లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు సులేఖ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మట్టిపనులతో గ్రామాలపై ఇసుక తుపాను

- విమానాశ్రయ పనుల వద్ద నీటితో మట్టిని తడపని నిర్మాణ సంస్థ
- ధూళితో ఇబ్బంది పడుతున్న పది గ్రామాల ప్రజలు
- అరికట్టకపోతే రోడ్డెక్కి వాహనాలను అడ్డుకుంటామని హెచ్చరిక



ఇళ్లపైకి ఎగురుతున్న ధూళి

విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా మట్టి పనులు జరుగుతుండంతో వచ్చే ధూళితో సమీప ప్రాంతంలోని సుమారు పది గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం అయితే చాలు ఇసుక తుఫానులా గాలికి ఎగిరి గ్రామాలపైకి ఈ ధూళి రూపంలో ఎగిరిపడుతోంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోకపోతే తామే రొడ్డెక్కి పోరాటాలకు దిగుతామని, విమానాశ్రయానికి వెళ్లే వాహనాలను అడ్డుకుంటామని ఆయా గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలో విమానాశ్రయం నిర్మాణం పనులు గత కొన్ని రోజులు నుంచి జరుగుతున్నాయి. ప్రస్తుతం మట్టి చదును పనులు చురుగ్గా చేపడుతున్నారు. దీంతో ఆ ప్రాంతలో ఎర్రటి మట్టితో కూడిన ధూళి విపరీతంగా మధ్యాహ్నం సమయంలో గాలికి గ్రామాల్లోకి ఎగిరిపడుతుంది. ఒక్కోరోజు అయితే ఏకంగా ఇసుక తుఫానును తలపిస్తుంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గూడెపువలస, రాళ్ళపాలెం, బైరెడ్డిపాలెం, దల్లిపేట, రెడ్డికంచేరు, దిబ్బలపాలెం, పిన్నింటిపాలెం, చేపలకంచేరు గ్రామల పరిస్థితిని చెప్పనక్కర్లేదు. ఇళ్ళలోకి ఎర్ర ధూలి గాలికి ఎగిరిపడుతుండడంతో ఇంట్లోని వస్తువులన్ని ఎర్రగా మారిపోతున్నాయి. గాలిలోని ధూళిని పీల్చడం వల్ల ఏమైనా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు భయపడుతున్నారు. చిన్నపిల్లలు ఊపిరితీసేందుకు ఇబ్బంది పడుతున్నారని అంటున్నారు. చివరకు ఆహార పదార్ధాలు మూతలు తీయాలన్నా భయమేస్తుందని ఆవేదన చెందుతున్నారు.

నీటితో తడపకపోవడం వల్లే..

మట్టి పనులు జరుగుతున్న చోట ఆయా పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు ధూళి ఎగరకుండా నీటితో తడపాలి. కాని నిర్మాణ సంస్థ అలాంటి చర్యలు ఏవీ చేపట్టడం లేదని ఈ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ప్రతిరోజు మధ్యాహ్నం గూడెపువలస, రాళ్లపాలెం గ్రామాల సమీపంలో విపరీతంగా గాలికి ఈ ధూళి ఎక్కువగా ఎగురుతోంది. చేపలకంచేరు రహదారిలో వెళ్ళాలటే ఆ ప్రాంత వాసులు భయపడుతున్నారు. అంతేకాక ఒక్కోసారి ఈ ధూళికి ముందు నుంచి వస్తున్న వాహనాలు కూడా కనబడని పరిస్థితి ఏర్పడుతోందని ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు ఇంటిలో ఉన్న ప్రతి వస్తువును కడుక్కోవలసిన పరిస్థితి దాపురించిందని చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఈ ప్రాంత ప్రజలందరం రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సి ఉంటుందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలపైకి ధూళి రాకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు..

ఎన్నికల్లో బాధ్యతగా పనిచేయాలి

రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి

ప్రజాశక్తి-సీతంపేట

ఎన్నికల దృష్ట్యా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలేన్స్, ఖర్చు వివరాల నమోదు బృందాలు బాధ్యతగా పనిచేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి సూచించారు. బుధవారం ఆయా బృందాలతో సమావేశం ఏర్పాటుచేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలయ్యేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు నిర్వహించిన ర్యాలీలు, సమావేశాలను వీడియోలు తీసి, ఖర్చులను సంబంధిత అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలని సూచించారు. అన్ని టీమ్‌లు తమ రిపోర్ట్ ను ప్రతిరోజూ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి అందజేయాలన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

సాధారణ ఎన్నికల దృష్ట్యా పాలకొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్ఒ కల్పనకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఏమైనా ఫిర్యాదులు చేయాలనుకొంటె కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. కంట్రోల్ రూం ఫోన్ నెంబర్: 08941-294040ను సంప్రదించాలని సూచించారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇందిర

ఎర్రజెండాకు అండగా నిలవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇందిర

ప్రజాశక్తి కొమరాడ

రానున్న ఎన్నికల్లో మతోన్మాద బిజెపితో జతకట్టిన పార్టీలను ఓడించి, ఎర్రజెండాకు అండగా నిలవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వాకాడ ఇందిర కోరారు. మండలంలోని దేవుకోన పంచాయతీ అంటివలస గ్రామంలో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇందిర, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద బిజెపిని బలపరిచే పార్టీలను ఓడించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలకు అండదండగా ఉంటున్న సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు వెంకటేష్, రామారావు, గిరిజన సంఘం నాయకులు గంగరాజు, బలరాం, సోమేశ్, కృష్ణ పాల్గొన్నారు.

23న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-సాలూరు

భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 23న పట్టణంలోని శ్రీ కోదండరామ కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు మీ సేవకై మేము సంస్థ అధ్యక్షులు ఇప్పిలి దిలీప్ కుమార్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి, రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన పేదవారికి రక్తదానం చేసేందుకు వీలుగా ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సాయం చేయడానికి యువకులు రక్తదానానికి ముందుకు రావాలని కోరారు.

కోడ్ కూసిందని సంతకాలతో ముగించారు

ప్రజాశక్తి-గరుగుబిల్లి

సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉండటంతో స్థానిక మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని బుధవారం సభ్యులు సంతకాలతో ముగించారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద వైస్ ఎంపిపి బత్తల లక్ష్మి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో సమస్యలపై సర్వసభ్య సమావేశంలో చర్చించలేమని ఎంపిడిఒ పైల సూర్యనారాయణ సభ్యులకు తెలియజేశారు. మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం 90 రోజుల్లోపు నిర్వహించాల్సి ఉన్న నేపథ్యంలో నిబంధనల మేరకు ఈ సమావేశం ఏర్పాటుచేశామన్నారు. కేవలం సభ్యుల సంతకాలు తీసుకుంటాం తప్ప ఎటువంటి సమస్యలపైనా చర్చించబోమని తెలిపారు. ఈసమావేశంలో జెడ్‌పి వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, వైస్ ఎంపిపి నేరడుబిల్లి లక్ష్మి, ఎంపిటిసి సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు) , దేవాతి నారాయణమ్మ, గుంట్రెడ్డి అన్న పూర్ణమ్మ, చింతల రూపవతి, సర్పంచులు బొంతాడ మహేశ్వర రావు, బోను చంద్రినాయుడు, కరణం రవీంద్ర, బేత వెంకటనాయుడు, తదితర సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జెడ్‌పి వైస్ చైర్మన్ మరిశర్ల, వైస్ ఎంపిపిలు

రాష్ట్రంలో గాడి తప్పిన పాలన

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందని, మళ్లీ సుపరిపాలన అందించాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా కావాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. బుధవారం సాలూరు మండలం అన్నమరాజువలస పంచాయతీ పరిధిలో లక్ష్మీపురం, పసుపు వానివలస, అంటివలస, రెయ్యివానివలస గ్రామాల్లో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక, అసాంఘిక, అసమర్థ పరిపాలన సాగుతోందన్నారు. ఇటువంటి పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ప్రజలందరూ ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆముదాల పరమేష్, వెంకటరమణ, తిరుపతిరావు, మరిపి సింహాచలం, లక్ష్మణదొర, లక్ష్మణరావు, రామన్నదొర, అన్నపూర్ణ, కృష్ణ పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న టిడిపి అభ్యర్థి సంధ్యారాణి, నాయకులు

ప్రత్యేక హోదా కోసం కృషి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు బత్తిన మోహన్‌రావు కోరారు. పట్టణంలో బుధవారం నియోజకవర్గ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో పార్వతీపురం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోటీ చేయనున్నట్లు తెలిపారు.



కిచ్చాడలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కిచ్చాడలో పోలీస్ కవాతు

ప్రజాశక్తి - కురుపాం :

మండలంలోని కిచ్చాడలో గ్రామంలో ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర బలగాలతో పోలీసుశాఖ ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.షణ్ముఖరావు, సిఆర్‌పిఎఫ్ సిఐ ఐఎస్ఎన్ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఇఒ సింహాచలం

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో చర్చివీధి, జగన్నాథపురం మున్సిపల్ పాఠశాలలను ఎంఇఒ సామల సింహాచలం బుధవారం సందర్శించారు. టీచర్ల డైరీలను తనిఖీ చేశారు. అకడమిక్ కేలండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేశారా? లేదా?, వర్క్ బుక్స్ పరిశీలించారు. విద్యార్థులకు చేతి రాతను చక్కగా నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జగన్నాథపురం మున్సిపల్ పాఠశాల ఐదో తరగతి విద్యార్థుల ఆంగ్ల భాషా పఠన సామర్థ్యాలను పరిశీలించి చక్కగా చదివిన విద్యార్థులను అభినందించారు.

పరీక్షా కేంద్రాల్లో కరెంటు కోత

ప్రజాశక్తి- మెరకముడిదాం

పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యుత్తు లేకపోవడంతో పరీక్ష రాసిన విద్యార్థులు బుధవారం ఇబ్బంది పడ్డారు. గత రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలు కారణంగా విద్యుత్తు సమస్య ఏర్పడింది. మెరక ముడిదాం, గర్భాం ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న నేపథ్యంలో అక్కడ కరెంటు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. వర్షం పడటంతో విద్యార్థులకు కేంద్రాలకు చేరుకోవడం ఒక సమస్య అయితే అక్కడ కరెంటు లేకపోవడం మరో సమస్యగా విద్యార్థులు చెబుతున్నారు. అధికారులు దృష్టి పెట్టి విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

50వ రోజుకు మిమ్స్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరశన సమ్మె బుధవారం నాటికి 50వ రోజుకు చేరుకుంది. స్థానిక ఆర్‌ఒబి వద్ద చేస్తున్న సమ్మెలో మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.వి. రమణ మాట్లాడుతూ గత 50రోజులుగా మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు జనవరి నెల జీతాలు, డిఎ బకాయిల, వేతన ఒప్పందం చేయాలని నిరశన సమ్మె చేస్తుంటే యాజమాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. పని చేసిన కాలానికి జనవరి నెల జీతాలు ఇంతవరకు మూడు నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం, మిమ్స్ యాజమాన్యం స్పందించి న్యాయమైన సమస్యలు పరిష్కరించి జనవరి నెల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు ఎం.నారాయణ, కె. కామునాయుడు, కె.మధు, గౌరి, మూర్తి, ఎం.నాగ భూషణం, అప్పలనాయుడు, వరలక్ష్మి, బంగారునాయుడు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ స్థాయి వర్క్‌షాప్

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రోగ్రామ్‌బుల్ లాజిక్ కంట్రోలర్ మీద రెండు రోజులు పాటు నిర్వహించిన జాతీయ స్థాయి విద్యార్థుల వర్క్‌షాపు బుధవారం ముగిసింది. ఈ సదస్సుకు ఎమ్‌కోర్ టెక్నాలజీస్ ప్రయివేటు లిమిటెడ్ ఆపరేషన్స్ డైరెక్టర్ సాయిశ్రీనివాస్ హజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. రెండు రోజుల కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ మూడోవ సంవత్సరం విద్యార్థులు, ఎలక్ట్రికల్ అధ్యాపక బృందం పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. విద్యార్థులు పిఎల్‌సి పైన స్కిల్స్ పెంపొందించుకున్నారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.హరిబాబు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె.సుబ్బరామయ్య, ఇన్చార్జి విభాగాధిపతి డాక్టర్ బి.వి.ఎస్ ఆచార్యులు, డాక్టర్ పి.జానకి, టి.పాపి నాయుడు, విజయ్ చంద్ర, బి.రామ్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు బహుమతులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మహాశివరాత్రి రెండు రోజులు స్థానిక ఆర్‌టిసి డిపో ఆదాయానికి అధిక కృషి చేసి ప్రతిభ కనపరిచిన ఆర్‌టిసి సిబ్బందికి బహుమతులను అందజేశామని డిపో మేనేజర్ కె రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మాట్లాడుతూ మహాశివరాత్రికి స్థానిక ఆర్‌టిసి డిపో నుంచి పుణ్యగిరి ఉమా కోటిలింగేశ్వరాలయానికి, ధర్మవరం వద్ద గల సన్యాసేస్వర ఆలయాల దర్శనార్థం యాత్రికులకు ప్రత్యేక బస్సులను నడిపామని అయితే ఈ ప్రత్యేక బస్సులలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి రెండు స్థానాలలో నిలిచిన నలుగురు ఉద్యోగులకు ఎస్ కోట డిపో ఆర్‌టిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శి కె. కోటేశ్వరరావు సౌజన్యంతో ప్రోత్సాహక బహుమతులను అందజేశామన్నారు. ఇందులో మొదటి స్థానంలో కండక్టర్ పి. శ్రీనివాసరావు, డ్రైవర్ ఆతవ శ్రీనివాసరావు, రెండవ స్థానంలో కండక్టర్ రాజేశ్వరి, డ్రైవర్ పి. గోపాలరావు బహుమతులను అందుకున్నారని అన్నారు. ప్రజలు ఆర్‌టిసి బస్సులలో ప్రయాణించి డిపో అభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటరావు, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కె. కోటేశ్వరరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు కడితే చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

రోడ్లుపై పశువులను కడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని మేధరవీధి, బంగారమ్మకాలనీ, యాతవీధి, గొల్లవీధి, బొప్పడాపువీధిలో పారిశుధ్య పనులను ఆమె బుధవారం పరిశీలించారు. బొప్పడాపువీధిలో రోడ్లుపై పశువులు కట్టడాన్ని ఆమె తప్పు బట్టారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పశువులను నివాసాలకు దూరంగా కట్టాలన్నారు. నివాస ప్రాంతాల్లో పశువులు కడితే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మేధరబంద ప్రధాన మురుగునీటి కాలువలో పూడికలు తొలగించాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతో పారిశుధ్య విభాగ ఉద్యోగులు పాల్గొన్నారు.

నోటి శుభ్రతే ఆరోగ్య భద్రత

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

నోటి శుభ్రతతోనే ఆరోగ్య భద్రత సాధ్యమని డెంటిస్ట్ రమ్య తెలిపారు. మండలంలోని చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో వరల్డ్ ఓరల్ డే సందర్భంగా డాక్టర్ రమ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి నోటి ఆరోగ్యం చాలా అవసరమన్నారు. నోటిలో ఉండే బ్యాక్టీరియా రక్తంలో చేరినప్పుడు గుండెతోపాటు అనేక ఇతర సమస్యలు వస్తాయన్నారు. దంతాలు చిగుళ్ళు పరిశుభ్రంగా లేకుంటే కేన్సర్ వంటి రోగాలకు గురయ్యే అవకాశం ఉందని



జియ్యమ్మవలస.. ర్యాలీ చేపడుతున్న వైద్యులు, సిబ్బంది



పార్వతీపురంరూరల్.. ర్యాలీని ప్రారంభిస్తున్న డిసిహెచ్ఎస్ వాగ్దేవి

తెలిపారు. ప్రతిఒక్కరూ తమ రూపంపై ఉన్న శ్రద్ధ దంతాలపై పెట్టకపోవడంతో నేడు అనేక నోటి సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రతిరోజూ రెండు పూటలా నోటిని పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ టి.కె.సునీల్ కుమార్, డాక్టర్ అనిల్ చైతన్య, కె.చంద్రవర్మ, హెడ్ నర్స్ కె.పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : నోటి శుభ్రతతోనే పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందవచ్చునని డిసిహెచ్ఎస్ డాక్టర్ వాగ్దేవి అన్నారు. బుధవారం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రి సిబ్బంది నిర్వహించిన ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవ అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెతోపాటు ఆసుపత్రికి చెందిన దంత వైద్యులు ఎం.దినేష్, ఆర్.శ్యామల, కె.సౌజన్య కూడా దీని ప్రాముఖ్యత గురించి నొక్కిచెప్పారు.

కార్యాలయ ప్రారంభమే విజయానికి నాంది

టిడిపి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం

ఎన్నికల్లో పార్టీ విజయానికి నాంది టిడిపి కార్యాలయ ప్రారంభమేనని ఆ పార్టీ కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టి.జగదీశ్వరి అన్నారు. బుధవారం కురుపాంలోని రావాడ జంక్షన్ సమీపంలో టిడిపి నూతన కార్యాలయాన్ని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేశ్ చంద్రదేవ్‌తో కలిసి జగదీశ్వరి ప్రారంభించారు. అనంతరం దూళికేశ్వర ఆలయం నుంచి పార్టీ కార్యాలయం వరకు టిడిపి శ్రేణులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భవిష్యత్తుకు భరోసా కావాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. టిడిపి ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరవేసి తీరుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, బిసి సెల్ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



టిడిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీమంత్రి శత్రుచర్ల, టిడిపి అభ్యర్థి జగదీశ్వరి

పార్వతీపురంరూరల్ : కలిసికట్టుగా పనిచేసి టిడిపిని అధికారంలోకి తీసుకువస్తామని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. బుధవారం పార్వతీపురం మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డులో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్రతో కలిసి బాబు షూరిటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు టిడిపి వైపు చూస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలనే సంకల్పంతో ఉన్నారని చెప్పారు.

సీతంపేట : మండలంలోని కొండపల్లి, కిట్టాలపాడు గ్రామాల్లో టిడిపి నియోజకవర్గ నాయకులు పడాల భూదేవి బుధవారం ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జయలక్ష్మి, సీనియర్ నాయకులు మూర మోహన్, గుణమ్మ శంకరరావు పాల్గొన్నారు.

టిడిపిలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న టిడిపి అభ్యర్థి విజయ్‌చంద్ర

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలో వివిధ పంచాయతీలకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరారు. టిడిపి బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జులు బేబినాయన, విజయచంద్ర సమక్షంలో మాజీ జెడ్‌పిటిసి తెంటు వెంకట అప్పలనాయుడు, బి.శ్రీరాములు, పెదబోగిల వైస్ సర్పంచ్ కె.అరవింద్‌తోపాటు కాశీపేట, గాదెలవలస, చినంకలం, బూర్జ, పెదబోగిల, పణుకుపేట, క్రిష్ణరాయపురం గ్రామాలకు చెందిన 800 మంది టిడిపిలో చేరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొమ్మినాయుని లక్ష్మణరావు, గొట్టాపు వెంకటినాయుడు, బి.చిరంజీవి, నాగభూషణరావు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : జగన్నాథపురంలో వైసిపి నుంచి పలువురు టిడిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి విజయ్ చంద్ర టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపరెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి పాల్గొన్నారు.

కొమ్మినేనికి ఘన నివాళి

సీతానగరం : కొమ్మినేని కిశోర్ ద్వితీయ వర్ధంతిని ఆయన నివాసం వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మినేని చిత్రపటానికి టిడిపి బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జులు బేబినాయన, విజయ్‌చంద్ర, మాజీ ఎమ్మెల్సీ జగదీశ్, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనువాసరావు, జనసేన పార్టీ నాయకులు పాలూరి బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రావద్దు



మోటార్లను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. బుధవారం మున్సిపల్ డిఇ కిరణ్ కుమార్, ఎఇ ఆనంద్‌తో కలిసి తోటపల్లి వద్ద ఇన్‌ఫిల్ట్రేషన్ బావులను, పంపుహౌస్ వద్ద ఉన్న తాగునీటి సరఫరా మోటార్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ప్రజలు, ప్రజాప్రతినిధుల నుండి బహిరంగంగానే విమర్శలు వస్తున్నాయని చెప్పారు. వీటిని అధిగమించేందుకు రాబోయే వేసవికాలం దృష్ట్యా నీటి నిల్వ సామర్థ్యం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి సరఫరా చేసే మోటార్లు మరమ్మతుకు గురైతే అదనపు మోటార్లను సిద్ధం చేసి ఉంచాలని చెప్పారు. పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాకు కావలసిన నీటి సేకరణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.



ఎస్‌బిఐ బ్రాంచిని ప్రారంభిస్తున్న విశాఖ డిజిఎం పంకజ్ కుమార్

ఎస్‌బిఐ సేవలను వినియోగించుకోండి

విశాఖ డిజిఎం పంకజ్ కుమార్

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

ఎస్‌బిఐ సేవలను సద్వినియోగం చేసుకొని, బ్యాంకు అభివృద్ధికి సహకారం అందించాలని డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతనంగా ఏర్పాటు చేసిన తమ బ్యాంకు శాఖను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జియ్యమ్మవలసలో ఎస్‌బిఐ బ్రాంచి ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి విభాగానికి చెందిన ప్రత్యేక అధికారి నియమించడం వల్ల ఖాతాదారుల పనులు సులభతరమౌతాయని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల శాలలుగా ప్రభుత్వ భవనాలు



పివిఆర్ పురంలో పంచాయతీ భవనంలో కట్టిన పశువులు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని పివిఆర్ పురం, బిటివాడలోని రోడ్లు, భవనాల శాఖ భవనాలు ప్రస్తుతం పశువుల శాలలుగా మారాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామాల్లో భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఎప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో నిరుపయోగంగా పడి ఉన్నాయి. దీంతో గ్రామస్తులు వీటిని పశువులశాలలుగా వినియోగిస్తున్నారు.

ప్రశాంతంగా న్యాయవాద సంఘ ఎన్నికలు

శృంగవరపుకోట : ఎస్‌కోట న్యాయవాద సంఘ (బార్ అసోసియేషన్) ఎన్నికల్లో కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి మామిడి చంద్రశేఖర్, సహాయ ఎన్నికల అధికారి బొబ్బిలి రామకృష్ణ తెలిపారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఎన్నికల అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి మండా కామేశ్వర రావు, జి.సూరిదేముడు వేసిన నామినేషన్లను బుధవారం సాయంత్రం 5 గంటల సమయం ముగిసే సమయానికి ఉపసంహరించుకోక పోవడంతో అధ్యక్ష పదవికి పోటీ అనివార్యమయిందన్నారు. నూతన కార్యవర్గాన్ని కార్యదర్శి బి.సత్యన్నారాయణ, ఉపాధ్యక్షుడు ఎం.అప్పారావు, సంయుక్త కార్యదర్శి ఎల్.అప్పారావు, కోశాధికారి బి.త్రిమూర్తులను సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందించారు.



ఆలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

కొత్తమ్మతల్లి, ముత్యాలమ్మ ఆలయాల ప్రతిష్ట

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని రెల్లివీధి సమీపంలో నూతనంగా నిర్మించిన కొత్తమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సిఎం రాజన్న దొర హాజరయ్యారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వేగావతి వంతెన సమీపంలో జాతీయ రహదారి పక్కన కొత్తగా నిర్మించిన ముత్యాలమ్మ గుడి ప్రతిష్ట కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు, పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, యువ నాయకుడు తాడ్డి యశోద కృష్ణ పాల్గొన్నారు.

అత్యాచార కేసులో నిందితునికి 11 ఏళ్ల జైలు

ప్రజాశక్తి - రామభద్రపురం

2017లో రొంపిల్లికి చెందిన ముదిలి కృష్ణపై కింతలి సోములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో ముద్దాయి కృష్ణకు 11 ఏళ్ల జైలు శిక్ష, రూ. 5 వేలు జరిమానా విధిస్తూ విజయనగరం మహిళా సెషన్ కోర్టు న్యాయమూర్తి పద్మావతి తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన కేసు వివరాల మేరకు.. ముద్దాయి కృష్ణ సోములు కుమార్తెను పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి లోబరుచుకొని అత్యాచారం చేయడంతో ఆమె గర్భం దాల్చింది. దీనిపై అప్పట్లో ఇక్కడ స్టేషన్‌లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుని గుర్తించి కోర్టుకి తరలించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీంద్ర బాధితుల తరుపున వాదనలు వినిపించారు. ఇరు పక్షాల వాదనలు పూర్తైన తరువాత న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు పోలీసులు తెలిపారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

వన్యప్రాణుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా అటవీశాఖ అధికారి జిఎపి ప్రసూన అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో జిల్లా అటవీ శాఖ, గ్రీన్ మెర్సి సంస్థ అటవీశాఖ సిబ్బందికి స్నేక్ రెస్క్యూపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మారుతున్న ప్రజల అవసరాల దృష్ట్యా అటవీ ప్రాంతాల్లో ప్రజలు నివాసయోగ్యంగా మార్చుకొనడంతోపాటు ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వడం వల్ల అడవులు తరిగిపోయాయని చెప్పారు. అందులో నివసిస్తున్న జంతువులతోపాటు పాములు మైదాన ప్రాంతాలకు చేరుకుంటున్నాయని తెలిపారు. వాటిని సంరక్షించి తిరిగి అడవులలో వదిలే కార్యక్రమంపై అటవీశాఖ సిబ్బంది అవగాహన పెంచుకోవడంతో పాటు ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పార్వతీపురం, కురుపాం, పాలకొండ రేంజర్లు, అటవీ శాఖ అధికారులు, సహాయకులు పాల్గొన్నారు.

వెంకంపేటలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని వెంకంపేట గ్రామంలో బందులుప్పి పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 82 మందికి వైద్య సేవలు అందించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందించారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధిలోనే మందిరం వీధిలో 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.కావ్య, ఎఎన్ఎం జానకిబాయ్ పాల్గొన్నారు.

సీతంపేటలో అన్నదానం

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో శ్రీలక్ష్మీగణపతి దేవాలయం 45 వార్షికోత్సవం సందర్భంగా బుధవారం 2 వేల మందికి అన్నదానం నిర్వహించారు. లక్ష్మీ గణపతి ఆలయంలో ప్రధాన అర్చకులు వేమకోటి సాయికృష్ణ శర్మ కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నిమ్మక కాంతారావు, ఇంజరాపు ఉమామహేశ్వరరావు, కందుల రాజేష్, దామోదల ఏసుబాబు, హరినాన ప్రకాశం, ఇందుపు త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.